

మృతదేహాలకు భద్రతేదీ..!

టెక్కలి పాత ఆస్పత్రిలో మార్చురీ అధ్వానంగా మారింది. కనీస వసతులు లేకపోవడంతో మృతుల బంధువులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో



యూరియా అందక రైతుల నిరసన

రైతులకు యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. యూరియా పంపిణీలో మొండిచేయి చూపారని కరకవలస రైతులు నిరసన వ్యక్తం చేశారు.

- 8లో

4న ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ ఆగస్టు 4న ఉదయం 9 గంటల నుంచి అనివెట్టి మండపంలో జరుగుతుందని ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ బుధవారం తెలిపారు. గ్రామపెద్దలు, ఆలయ ప్రధానార్చకులు, సిబ్బంది సమక్షంలో హుండీలను తెరిపించి నిబంధనల ప్రకారం లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

బలవంతపు భూసేకరణ నిలిపేయాలి



రైతులు, వివిధ సంఘాల నాయకులతో ర్యాలీ నిర్వహిస్తున్న శ్రీనివాసరావు

వజ్రపుకొత్తూరు రూరల్: ఉద్దాన ప్రాంతంలో కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ, బలవంతపు భూసేకరణ నిలిపేయాలని కోరుతూ ఎయిర్‌పోర్టు బాధిత గ్రామాల్లో రైతులు, వామపక్ష నాయకులు, వివిధ సంఘాల నేతలు బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. బలవంతపు భూసేకరణ చేస్తే ప్రతిఘటన తప్పదని వారంతా హెచ్చరించారు. ఈ సందర్భంగా ఒంకులూరులో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ప్రజల పక్షాన నిలుస్తూ వారికి ప్రయోజనాలను చేకూర్చేలా పాలన సాగించాలే తప్ప.. కార్పొరేట్ కంపెనీలకు అమ్ముడుపోయి ప్రజల భూములను లూటీ చేసేలా వ్యవహరించడం తగదన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు కార్గోఎయిర్ పోర్టుపై చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వ్యవసాయ శాఖ మంత్రివా లేక విధ్వంస శాఖ మంత్రివా అంటూ అచ్చెన్నాయుడిపై మండిపడ్డారు. కొబ్బరి, జీడి, మామిడి, పనస లాంటి పచ్చని పంటలతో విరాజిల్లుతున్న ఉద్దాన ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఢిల్లీలాంటి మహానగరంలో 150 ఎకరాల్లో మాత్రమే కార్గో ఎయిర్‌పోర్టు ఉంటే ఇక్కడ 1,400 ఎకరాలు భూమిని సేకరించాలని నిర్ణయించడం ఎవరి ప్రయోజనాల కోసమని ప్రశ్నించారు. జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిన ఉద్దానం జీడి పంటను కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో నాశనం చేస్తే పర్యావరణంతో పాటు లక్షలాది మంది రైతులు, జీడి కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు, కార్యదర్శి జోగి అప్పారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి వంకల మాధవరావు, రైతు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహన్‌రావు, సీపీఎంఎల్ లిబరేషన్ నాయకుడు ఎం.రామారావు, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పి.కుసుమ తదితరులు పాల్గొన్నారు.

భళా మోక్షశ్రీ



అవార్డుతో మోక్షశ్రీ

శ్రీకాకుళం : బలగలో నివాసముంటున్న వంజరాపు సాయికుమార్, రమ్య దంపతుల కుమార్తె మోక్షశ్రీ ప్రపంచ రికార్డు సాధించింది. రెండేళ్ల ఎనిమిది నెలల వయసులోనే కెమిస్ట్రీ సబ్జెక్టులోని 30 మూలకాలను 23.37 సెకెండ్లలో చెప్పి వరల్డ్ వైడ్ బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించింది. జూలై 16న ఆన్‌లైన్ విధానంలో ఈ ఘనత సాధించింది. ప్రపంచ రికార్డుకు సంబంధించిన ధ్రువపత్రం మంగళవారం తల్లిదండ్రులకు చేరింది. మోక్షశ్రీ తల్లి రమ్య మత్స్యశాఖలో సాగర మిత్రగా పని చేస్తుండగా, తండ్రి సాయికుమార్ సిమెంట్ బొమ్మలను తయారు చేస్తుంటారు. వీరి స్వస్థలం హిరమండలం అయినప్పటికీ ఉద్యోగరీత్యా దంపతులు బలగలో నివాసముంటున్నారు.

కొత్తమ్మతల్లికి గాజుల అలంకరణ



శ్రావణమాసం సందర్భంగా కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి అమ్మవారికి బుధవారం గాజులతో అలంకరణ చేశారు. ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ నేతృత్వంలో అర్చకుడు కమ్మకట్టు రాజేష్ నేతృత్వంలో ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

-టెక్కలి



ఆంక్షల ఇంధనం ▶ అందని వందనం

● తల్లికి వందనం పథకం వర్తించక అర్హుల అవస్థలు ● కొర్రీలు, ఆంక్షలు, తప్పులతో లబ్ధిని కోల్పోయిన తల్లులు
● కూటమి ప్రభుత్వ తీరుపై మండిపాటు

రిక్షా కార్మికుడికి రైస్ మిల్లులు ఉన్నాయట..

టెక్కలి: శ్యామసుందరాపురం గ్రామానికి చెందిన బెండి అప్పలరాజు, లక్ష్మీ దంపతులు రోజు వారి కూలీలు. అప్పలరాజు రిక్షా కార్మికుడిగా పనిచేస్తున్నాడు. వీరి కుమార్తె సీతాపురం జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతోంది. వీరికి తల్లికి వందనం పథకం వర్తించలేదు. ఎందుకా అని ఆరా తీయగా సచివాలయ సిబ్బంది చెప్పిన మాటలు విని షాక్‌కు గురయ్యారు. ఉండడానికి సరైన ఇల్లు కూడా లేని ఈ కుటుంబానికి రెండు రైస్ మిల్లులు, 10 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు 8 విద్యుత్ మీటర్లు ఉన్నాయని ఆన్‌లైన్‌లో చూపిస్తోందట. ఆన్‌లైన్‌లో తప్పిదాల కారణంగా వీరి కుమార్తెకు తల్లికి వందనం అందలేదు.



బెండి అప్పలరాజు, లక్ష్మి

విద్యుత్ కనెక్షన్ లేకపోయినా..

హిరమండలం: గులుమూరు పంచాయతీ జగన్నాథపురం గ్రామానికి చెందిన నిమ్మక పెంటయ్య, ఈశ్వరి దంపతులు వంశధార నిర్వాసితులు. ప్రస్తుతం రేకుల షెడ్‌లో నివసిస్తున్నారు. దీనికి అసలు విద్యుత్ కనెక్షనే లేదు.. కానీ 74 సర్వీసులు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో చూపిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో వీరు ముగ్గురు పిల్లలు హేమంత్, జస్మిత, ధార్మిక్‌లకు తల్లికి వందనం పథకం వర్తించలేదు. పెంటయ్యకు సంబంధించి ఆధార్ అనుసంధానంలో 74 కనెక్షన్లు ఉన్నట్లు ఆన్‌లైన్లో ఉంది. పోలాకి మండలంలో 5, రణస్థలం-4, జి.సిగడాం-3, లావేరు-8, పొందూరు-34, ఎచ్చెర్ల-20 విద్యుత్ కనెక్షన్లు ఉన్నట్లు చూపిస్తుంది. న్యాయం చేయాలని బాధితుడు అధికారులను ఆశ్రయించినా ఇంకా ఫలితం దక్కలేదు.



పెంటయ్య కుటుంబం

బతికున్న వారిని..

మెళియాపుట్టి: చక్కగా బడిలో చదువుకుంటున్న ఈ ఇద్దరు పిల్లలు చనిపోయారని సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదు చేశారు. ఫలితంగా వీరిద్దరూ తల్లికి వందనం పథకానికి దూరమయ్యారు. మెళియాపుట్టికి చెందిన మూగి భాస్కరరావు, కృష్ణవేణిల కుమారులు మూగి మోక్షిత్, మూగి షారుఖ్ ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నారు. వీరికి తల్లికి వందనం డబ్బులు పడలేదు. ఎందుకా అని ఆరా తీస్తే.. హౌస్ హోల్డ్ సర్వేలో అధికారులు వారిద్దరూ చనిపోయినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలిసి తల్లిదండ్రులు నిశ్చేష్టులయ్యారు. గతంలో వైఎస్ జగన్ ఉన్నప్పుడు అమ్మ ఒడి వచ్చిందని, ఈ సారి కూడా అలాగే వస్తుందని ధీమాగా ఉన్నామని, కానీ అధికారుల తప్పిదం వల్ల పథకానికి దూరమయ్యారని వారు వాపోయారు. ఈ ఘటనపై తల్లిదండ్రులు జేసీకి ఫిర్యాదు చేయడంతో వెల్ఫేర్ అసిస్టెంట్, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

ఒక ఆధార్.. 50 విద్యుత్ కనక్షన్లు

ఎచ్చెర్ల: కొత్తపేట పంచాయతీ గాడుపేటకు చెందిన ఆటోడ్రైవర్ బుగత గోవిందరావు పిల్లలు యశ్వంత్ 9వ తరగతి, విమల 7వ తరగతి చదువుతున్నారు. వీరికి తల్లికి వందనం వర్తించలేదు. కారణమేంటని ఆరా తీస్తే 300 యూనిట్లు కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్నారని సిబ్బంది తెలియజేశారు. వాస్తవానికి గోవిందరావు 144 యూనిట్లు మించి వినియోగించలేదు. దీంతో శ్రీకాకుళం మెయిన్ బ్రాంచ్‌కు వెళ్లి ఆరా తీయగా అక్కడ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో గోవిందరావు అవాక్కయ్యారు. ఇతని ఆధార్ నెంబరుతో 50 విద్యుత్ మీటర్లు తీసుకున్నట్లు రికార్డుల్లో ఉందని చెప్పారు. ఎచ్చెర్ల, లావేరు, పొందూరు, రణస్థలం, జి.సిగడాం మండలాల్లో ఈ మీటర్లు ఉన్నట్లు తేలింది.



బుగత గోవిందరావు

శ్రీకాకుళం న్యూకాలనీ:

తల్లికి వందనం పథకం అందక అనేక మంది తల్లులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తాము తప్పులు చేయకపోయినా అనర్హత పేరిట పథకానికి దూరంగా ఉంచడంపై మండిపడుతున్నారు. అసలు.. ఇచ్చే మనసు లేనప్పుడు పథకం ఎందుకు ప్రకటించాలని.. తమను ఎందుకు ఇంతలా మోసం చేయాలని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. పాలకులకు తగిన సమయంలో బుద్ధి చెబుతామంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మీ పిల్లలు చనిపోయారని, తల్లి చనిపోయిందని, మీపేరిట కార్లు, మిల్లులు ఉన్నాయని, 70 విద్యుత్ మీటర్లు ఉన్నాయని, 10 ఎకరాల భూమి ఉందని, ఉచిత విద్యాహక్కు చట్టం ద్వారా చదువుతున్నారని.. ఇలా ఒకటేంటి ? లెక్కకు మించిన తప్పులు, దోషాలతో తల్లికి వందనం పథకం వర్తించక జిల్లా వ్యాప్తంగా బాధితులు నిరాశలో కూరుకుపోయారు.



సచివాలయం

లక్ష్మి బదులుగా ధనలక్ష్మి ఖాతాకు..

సారవకోట: మండలం గొర్రిబంద గ్రామానికి చెందిన ఈ మహిళ పేరు రఘుమహంతి లక్ష్మి. ఈమె ఇద్దరు పిల్లలు రఘుమహంతి ఇజ్జ్వల్ 10వ తరగతి, హర్షశ్రీ 6వ తరగతి చదువుతున్నారు. వీరిలో ఇజ్వల్‌కు మాత్రమే తల్లికి వందనం వర్తించింది. హర్షశ్రీకి నగదు జమ కాకపోవడంతో తల్లి లక్ష్మి సచివాలయంలో ఫిర్యాదు చేయగా మైలపల్లి ధనలక్ష్మి ఖాతాలో నగదు జమ అయినట్లు చూపిస్తోంది. ఆ పేరుతో పంచాయతీలో ఎవరు లేరు. ఆ సొమ్ము ఎటు వెళ్లిందో తెలియక బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తోంది.



రఘుమహంతి లక్ష్మి

ఆందోళన వద్దు..

తల్లికి వందనం అందకపోతే రుజువు పత్రాలతో హెచ్‌ఎం/ప్రిన్సిపాళ్లను సంప్రదిస్తే సరిపోతుంది. అంతా ఆన్‌లైన్‌లోనే డేటా ఎంట్రీ చేస్తారు. స్కూళ్లలో న్యాయం జరగని పక్షంలో ఎంఈఓ కేంద్రాలను సంప్రదించాలి. ఎలాంటి ఆందోళన అవసరం లేదు.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, జిల్లా విద్యాశాఖాధికారి



ఆది నుంచీ అవాంతరాలే..

● వాస్తవానికి పాఠశాలలు పునఃప్రారంభం రోజున జూన్ 12న తల్లికి వందనం పథకం నిధుల్ని జమచేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. జీవోను విడుదల చేసి షాకిచ్చింది. ఈ పథకం ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాల్లో తొలుత నీకు 15 వేలు, నీకు 15 వేలు అంటూ ఊదరగొట్టిన రాష్ట్రప్రభుత్వం.. తీరా రూ.13 వేలు మాత్రమే జమ చేసింది. మిగిలిన రూ.2 వేలు ఎగ్గొట్టింది. పోనీ జమ చేసిన మొత్తం అందరికీ వేశారా? అంటే అదీలేదు.

● పునర్విభజన శ్రీకాకుళం జిల్లాలో గత ఏడాది (2024-25) ఒకటి నుంచి ఇంటర్(+2) వరకు 3.05 లక్షల మంది చదువుకున్నారు. వీరిందరికీ కలిపి మొదటి ఏడాది రూ.457 కోట్ల నిధులను కూటమి ప్రభుత్వం బాకీ పడి ఉంది.

● రెండో ఏడాది 2025-26కిగాను యూ-డైస్ లెక్కల ప్రకారం ఒకటి నుంచి పదో తరగతి వరకు 2,76,593 మంది, ఇంటర్మీడియెట్ 46,761 మంది చదువుతున్నారు. ఒకటి నుంచి ఇంటర్ మొత్తం కలిపి 3,02460 మంది చదువుతున్నారు. వీరిలో ఫస్ట్‌ఫేజ్‌లో 2,28,448 మందికి లబ్ధిచేకూర్చినట్టు అధికారులు చెబుతున్నారు. అనంతరం ఒకటోతరగతి, ఇంటర్‌లో ప్రవేశాల తర్వాత ఎంతమందికి లబ్ధి జమచేశారో స్పష్టత రావడం లేదు.

రేపు పది మండలాల్లో విద్యుత్ కోత

అరసవల్లి: జిల్లాలో ఆర్‌డీఎస్ఎస్ పథకం ద్వారా విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 10 మండలాల పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి బుధవారం తెలిపారు. రణస్థలం మండలంలో కోష్ట, పిసిని ఫీడర్ల పరిధిలో వెంకటరావుపేట, వల్లభరావుపేట, దేరశాం, లావేరు మండలంలో అదపాక ఫీడర్ పరిధిలో గుర్రాలపాలెం, పైడయ్యవలస, పెద్దకొత్తపల్లి, ఎచ్చెర్ల మండలంలో కొయ్యాం, జర్జాం, ఎస్ఎం.పురం, బడివానిపేట, ఫరీదుపేట, కె.కె.నాయుడుపేట, పాతపట్నం మండలంలో పాతపట్నం టౌన్, ఆర్ఎల్‌పురం, కొరసవాడ, చెంగుడి, సరళి, సీతరాంపల్లి, బోరుభద్ర, తిద్దిమి, మెళియాపుట్టి మండలంలో చిన్నహంస, తిదిమి, మెళియాపుట్టి, కోటబొమ్మాళి మండలంలో అక్కుపల్లి, సరియాపల్లి, దంత, పోలాకి మండలంలో ఇండస్ట్రియల్ ఎక్స్‌ప్రెస్, డోల, పోలాకి, జర్జాం ఫీడర్ల పరిధిలో ఎస్ఎం.పురం, గొల్లలవలస, తోటాడ, సుసరాం, నడగాం, సుందరాపురం, చోడవరం, వెంకటాపురం, కవిటి మండలంలో డిజిపుట్టుగ, కుసుంపురం, మాణిక్యాపురం, దూగానపుట్టుగ, సరుబుజ్జిలి మండలంలో రొట్టవలస, ఆమదాలవలస మండలంలో జికె.వలస, కొత్తవలస, నిమ్మతొర్లాడ, కొరపాం, సీపన్నపేట తదితర గ్రామాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

ఉద్యోగులకు బాబుగారి ▶ బెంగారం

● అబాసుపాలవుతున్న పీ-4 కార్యక్రమం
● బంగారు కుటుంబాల దత్తతకు సంపన్నుల విముఖత
● ఆ భారం ఉద్యోగులపై మోపుతున్న కూటమి సర్కారు
● ప్రభుత్వ తీరుపై సర్వత్రా మండిపాటు..

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

సీఎం చంద్రబాబు పేద కుటుంబాలను పైకి తీసుకొస్తానంటే ఏదో అనుకున్నారు. ఆయన చేతిలో మంత్రదండం ఉందనేలా బిల్డప్ ఇచ్చారు. ఇప్పుడేమో పేదవాళ్లను పైకి తీసుకురావడం ప్రభుత్వంతో అయ్యే పనికాదని సంపన్నులపై దృష్టి పెట్టారు. వారంతా ముందుకు రావాలని చేయి చాపుతున్నారు. అలా ముందుకొచ్చే దాతలకు మార్గదర్శకులనే పేరు పెట్టారు. పేద కుటుంబాలకు బంగారు కుటుంబాలని నామకరణం చేశారు. స్వచ్ఛందంగా దాతలు రాకపోయినా బలవంతంగా అంటకడుతున్నారు. అయినప్పటికీ సంపన్నులు ముందుకు రాకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులే మార్గదర్శకులుగా(దాతలు) ఉండాలని ఒత్తిడి చేస్తున్నారు. ఒక్కొక్కరు ఐదారుగురు చొప్పున దత్తత తీసుకోవాలని టార్గెట్ ఫిక్స్ చేస్తున్నారు. దీంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

అబాసుపాలు..

ప్రభుత్వం గొప్పగా చెబుతున్న పీ-4 కార్యక్రమం అబాసుపాలవుతోంది. ప్రభుత్వం చెబుతున్న మాటలకు, ఆచరణకు పొంతన లేకుండాపోతోంది. సమాజంలోని సంపన్నులు పేదలైన బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని ఆర్థికంగా, ఇతరత్రా అంశాల్లో అండగా ఉంటూ పైకి తీసుకొచ్చేలా పీ-4 కార్యక్రమం రూపకల్పన చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. పీ-4 కార్యక్రమం బలవంతంగా అంటగట్టే కార్యక్రమంగా మారిపోయింది. ప్రభుత్వం చెబుతున్న ప్రకారం బంగారు కుటుంబాలను దత్తత తీసుకోనున్న మార్గదర్శకులు.. ఆ కుటుంబం ఉండటానికి ఇల్లు, ఉపాధి, పిల్లలకు నాణ్యమైన విద్య, ఆరోగ్య పరంగా ఇబ్బందులుంటే ఆదుకోవడం వంటి అనేక కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది.

ఉద్యోగులకు టార్గెట్..

ఆగస్టు 15 నాటికి జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా చేయాలని ప్రభుత్వం డెడ్‌లైన్ పెట్టింది. పేదలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకు రాకపోవడంతో ఉద్యోగులనే మార్గదర్శకాలుగా నమోదు చేసుకోవాలని మెడపై కత్తి పెడుతోంది. జిల్లాలో 75,566 బంగారు కుటుంబాలను సర్వే ద్వారా గుర్తించారు. ఆగస్టు 15కల్లా 59,124 బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రభుత్వం లక్ష్యం నిర్దేశించింది. సంపన్నుల నుంచి స్పందన రాకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులపైనే భారం మోపింది. ఇప్పటి వరకు జిల్లాలో 7,694 మంది మార్గదర్శకులను నయానోభయానో చెప్పి ఒప్పించింది. వీరికి 29,818 కుటుంబాలను దత్తత తీసుకున్నట్టు ఒప్పించారు. ఇంకా 30 వేల కుటుంబాలు మిగిలి ఉంటాయి. సచివాలయం ఉద్యోగులతో కలిపి జిల్లాలో 35 వేల వరకు ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వారిలో కొంతమంది ఇప్పటికే ఆన్‌లైన్‌లో మార్గదర్శకులుగా నమోద య్యారు. మిగతా వారంతా ఆగస్టు 15వ తేదీలోగా మార్గదర్శకులుగా చేరాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది.



నలిగిపోతున్న ఉద్యోగులు..

బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు మార్గదర్శకులు ముందుకురాకపోవడంతో ఉపాధ్యాయులు, ఇతరత్రా ఉద్యోగులతో పాటు సచివాలయం ఉద్యోగులు కూడా ఐదారుగురు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది. ప్రతి ఒక్కరు ఆన్‌లైన్‌లో నమోదు చేయించేలా ఎంపీడీవోల చేత సతాయిస్తోంది. దీంతో ఉద్యోగులు పెద్ద ఎత్తున నలిగిపోతున్నారు. ముఖ్యంగా సచివాలయం ఉద్యోగులకు 30వేల లోపే జీతం ఉంటుంది. వారు కూడా పేదలైన బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారిని ఏవిధంగా పైకి తీసుకురాగలరో ప్రభుత్వమే చెప్పాలి. ఇప్పటికే ఉద్యోగులు పెద్ద ఎత్తున ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. తమకు రావాల్సిన జీతభత్యాలు, పెండింగ్ బకాయిలు ఇవ్వకుండా ఈ కొత్త డ్రామాలేంటని నిలదీస్తున్నారు.

ఇదేం తీరు..



సచివాలయం ఉద్యోగులుగా ప్రభుత్వం నిర్దేశించిన విధులు నిర్వర్తిస్తాం. అయితే బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి సంపన్నులు ముందుకు రాకపోతే సచివాలయ ఉద్యోగులే దత్త తీసుకోవాలని ప్రభుత్వ పెద్దలు చెప్పడం దారుణం. రూ.30వేల జీతంతో బంగారు కుటుంబాలను ఏ రకంగా ఆదుకోగలం?

– బూరాడ మధుబాబు, గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఒత్తిడి తగదు..



పీ-4 అంటూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులపై ఒత్తిడి పెంచుతోంది. ఉపాధ్యాయులతో పాటు ఉద్యోగులకు కూడా బంగారు కుటుంబాలంటూ దత్తత స్వీకరించడం, సహాయ కార్యక్రమాలు చేపట్టడంపై నిర్బంధం చేయకూడదు. ఇలాగే ప్రభుత్వం వ్యవహరిస్తే ఉద్యోగుల నుంచి తీవ్ర ఆందోళన తప్పదు.

– కిలారి నారాయణరావు, జిల్లా అధ్యక్షుడు, పి.ఆర్.మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం

కరెన్సీ కళ!

శ్రీకాకుళం నగరంలోని కంపోస్టు కాలనీకి చెందిన కళాకారుడు లాల్ ప్రసాద్ డాకోజు తన అభిమాన సినీ నటుడు సోనూసూద్ జన్మదినం సందర్భంగా బుధవారం వినూత్న రీతిలో శుభాకాంక్షలు తెలియజేశారు. రూ.34,700 విలువైన నోట్లు, నాణేలతో సుమారు 5 గంటల పాటు శ్రమించి అపురూప చిత్రాన్ని రూపొందించారు.

– శ్రీకాకుళం కల్చరల్



ఆర్టిస్టు లాల్‌ప్రసాద్



నోట్లు, నాణేలతో సోనూసూద్ బొమ్మ

వైరల్ జ్వరాల విజృంభణ



సారవకోట పీహెచ్‌సీలో విద్యార్థులు

సారవకోట: గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. చిన్నాపెద్దా తేడా లేకుండా జ్వరాల బారిన పడుతున్నారు. కొంతమంది ఆర్ఎంపీ వైద్యులను ఆశ్రయిస్తుండగా మరి కొందరు సమీప పీహెచ్‌సీలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. సారవకోట, చోడసముద్రం, చిన్న గుజ్జువాడ తదితర గ్రామాల్లో జ్వరాల తీవ్రత అధికంగా కనిపిస్తోంది. తర్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు జ్వరాలతో బాధపడుతుండటంతో సారవకోట పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు దోమలు, ఈగల ఉద్ధృతి పెరగడం వ్యాధుల విజృంభణకు కారణమని తెలుస్తోంది.

మూడు రోజుల పాటు స్వాతంత్య్ర వేడుకలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా ఆవిర్భవించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 13 నుంచి 15 వరకు స్వాతంత్య్ర వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా అధికారులు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 13న ప్రారంభ సభ, శోభాయాత్ర, 14న సంప్రదాయ క్రీడలు, రచన, చిత్రలేఖన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గౌరవ సత్కారాలు, 15న జెండా వందనం నిర్వహించనున్నారు. అరసవల్లి దేవాలయం, రైల్వేస్టేషన్, జాతీయ రహదారుల జంక్షన్‌లలో ప్రత్యేక అలంకరణలు ఏర్పాటు చేయనున్నారు.

క్లుప్తంగా

రైల్వేగేట్ విరిగి మహిళకు గాయాలు



నిలిచిన ట్రాఫిక్

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం నుంచి రత్తకన్న వైపు వెళ్లే రోడ్డుమార్గంలో ఉన్న రైల్వేగేటు విరగడంతో ఆ మార్గం గుండా వెళ్తున్న మహిళ తలకు తీవ్రగాయాలయ్యాయి. బుధవారం రాత్రి రత్తకన్న వైపు నుంచి ఇచ్ఛాపురం వైపు టెంట్ సామాగ్రితో వ్యాన్ వస్తుండగా అప్పటికే ట్రెన్ వస్తుందని గేటు వేసి ఉంది. ట్రెన్ వెళ్లిపోయాక గేటు పైకి ఎత్తే సమయంలో కింది నుంచి వెళ్తున్న వ్యాన్‌పై గేటు విరిగి పడింది. అదే సమయంలో పక్కనుంచి వెళ్తున్న ఒడిశాలోని దేవులమద్రికి చెందిన మహిళ తలపై గేటుపడి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన మహిళను వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలు అందించారు. గేటు కోసం రైల్వే అధికారులు కొంత సమయం తాత్కాలిక ఏర్పాట్లు చేసి అనంతరం గేటు మరమ్మతులు చేపట్టారు. గేటు మరమ్మతుల సమయంలో ఈ మార్గంలో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

ఆగస్టు 2న ఉపాధ్యాయుల ధర్నా

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యారంగంలో ఎదురవుతున్న సమస్యలతోపాటు, ఆర్థికపరమైన సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 2వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) శ్రీకాకుళం జిల్లా చైర్మన్ బమ్మిడి శ్రీరామ్మూర్తి, జనరల్ సెక్రటరీ పడాల ప్రతాప్ కోరారు. నగరంలోని ఎన్జీవో హోమ్‌లో బుధవారం సాయంత్రం జరిగిన ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయులపై బలవంతంగా పీ–4 కార్యక్రమాన్ని రుద్దుతూ నిర్బంధం చేయడం సరికాదన్నారు. నూతనంగా అప్‌గ్రేడ్ అయిన స్థానాలను కోరుకున్న ఉపాధ్యాయులకు తక్షణమే జీతాలు చెల్లించాలన్నారు. 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ను ప్రకటించాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విన్నవించారు. మజ్జి మదన్‌మోహన్, గురుగుబెల్లి రమణ, పూజారి హరిప్రసన్న తదితరులు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. జీవో నంబరు 57ను అమలు చేసి 2004 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు ఉద్యోగంలో చేరిన వారందరికీ పాత పెన్షన్ పథకం అమలు, తదితర డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల అన్నింటిపై ప్రభుత్వం ఆగస్టు ఒకటో తేదీలోగా స్పందించకుంటే ఆందోళనబాట పడతామని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 2వ తేదీన కలక్టరేట్‌ల వద్ద ధర్నా అనేది కేవలం ఆరంభం మాత్రమేనని.. ప్రభుత్వం దిగిరాకుంటే ఉద్యమబాట తప్పదని హెచ్చరించారు. ఫ్యాప్టో ప్రతినిధులు వి.సత్యనారాయణ, ఎ.రామారావు, బి.నవీన్, ఎస్.రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

- టెక్కలి పాత ఆస్పత్రిలో అధ్వానంగా మార్చురీ
- మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బందులు
- కొత్త ఆస్పత్రిలో పూర్తికాని పనులు

మృతదేహాలకు భద్రతేదీ..!



మౌలిక సదుపాయాలు లేని మార్చురీ విభాగం



టెక్కలి:

డివిజన్ కేంద్రమైన టెక్కలిలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి పాత భవనం వద్ద మార్చురీ విభాగం పూర్తిగా దీనావస్థకు చేరుకుంది. కొత్త ఆస్పత్రిలో మార్చురీ విభాగం పనులు పూర్తి కాకపోవడంతో, పాత ఆస్పత్రికి ఆనుకుని మార్చురీ విభాగం కొనసాగుతోంది. అయితే ఇక్కడ విద్యుత్, ఫ్రీజర్ సదుపాయం, కనీసం సెక్యూరిటీ సిబ్బంది కూడా అందుబాటులో ఉండడం లేదు. దీంతో ఒక్కోసారి చీకటిపడిన తర్వాత మార్చురీలో భద్రపరిచిన మృతదేహాలకు కనీసం భద్రత లేని దుస్థితి చోటు చేసుకుంటోంది. దీనిపై పలు సందర్భాల్లో మృతుల బంధువులు ఆస్పత్రి సిబ్బంది బహిరంగంగానే ఆందోళన చేసినప్పటికీ పరిస్థితి మాత్రం చక్కబడడం లేదు. మార్చురీ వద్ద ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో మృతుల బంధువులే కాపలా కాసుకునే దుస్థితి దాపురిస్తోంది.



టెక్కలి కొత్త ఆస్పత్రి వద్ద నత్తనడకన సాగుతున్న మార్చురీ భవనం పనులు

నత్తనడకన పనులు

ఇదిలా ఉండగా కొత్త ఆస్పత్రిలో మార్చురీ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అంతేకాకుండా ఆస్పత్రికి వెనుక వైపు మార్చురీ నిర్మాణం చేయాలని సూచనలు ఉన్నప్పటికీ, అవేమీ పట్టించుకోకుండా పాత గేటు మార్గంలో ఓపీకి ఎదురుగా మార్చురీ భవనం నిర్మాణం చేస్తుండడంతో అనేక విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. ఏది ఏమైనప్పటికీ టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన మార్చురీ విభాగంలో ఎటువంటి మౌలిక సదుపాయలు లేక దీనావస్థలో ఉండడం, మరోవైపు కొత్త ఆస్పత్రి వద్ద మార్చురీ భవన నిర్మాణం పనులు నత్తనడకన సాగుతుండడంతో మృతదేహాల భద్రతపై నిర్లక్ష్యం కనిపిస్తోంది.

వైద్యం దయనీయం



మంత్రి అచ్చెన్నాయుడి సొంత నియోజకవర్గంలో ప్రభుత్వ వైద్యం దయనీయంగా మారిందని చెప్పడానికి మార్చురీ విభాగం దుస్థితి ఒక నిదర్శనం. కొన్ని నెలల క్రితం కొత్త ఆస్పత్రి వద్ద మార్చురీ భవనం పనులు ప్రారంభించినప్పటికీ అవి నత్తనడకన సాగుతున్నాయి. దీంతో పాత ఆస్పత్రి వద్ద మార్చురీ విభాగంలో ఎటువంటి మౌలిక సదుపాయాలు లేని చోట మృతదేహాలను భద్రపరుస్తున్నారు. ఇటువంటి పరిస్థితి లేకుండా అధికార యంత్రాంగం స్పందించాలి.
– సత్తారు సత్యం, వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెక్కలి

పనులు పూర్తయితే తరలిస్తాం



కొత్త ఆస్పత్రిలో ఆగస్టు నెలాఖరులోగా మార్చురీ భవనం పనులు పూర్తి చేస్తామని సంబంధిత అధికారులు తెలిపారు. ఆ భవన నిర్మాణం పనులు పూర్తయితే మార్చురీని తరలిస్తాం.
– సూర్యారావు, ఆస్పత్రి సూపరింటెండెంట్, టెక్కలి

అవినీతి తిమింగలం గోవిందరాజులు

- ఆయనకు వైఎస్ జగన్‌ను విమర్శించే అర్హత లేదు
- మండిపడిన వైఎస్సార్‌సీపీ నాయకులు

టెక్కలి:

కోటబొమ్మాళి మండలంలో బోయిన గోవిందరాజులు అనే వ్యక్తి ఒక అవినీతి తిమింగలమని, అతడికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే అర్హత లేదని మేజర్ పంచాయతీ సర్పంచ్ కాళ్ల సంజీవరావు, ఎంపీటీసీ కె.శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కె.విశ్వనాథరెడ్డి, డబ్బీరు ప్రదీప్‌లు మండిపడ్డారు. ఇటీవల టీడీపీ నాయకుడు గోవిందరాజులు చేసిన విమర్శలను ఖండిస్తూ బుధవారం కోటబొమ్మాళిలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్రను తాకట్టుపెట్టిన నాయకులు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడులు అని, అందుకే ఈరోజు వారికి రాష్ట్ర, కేంద్రమంత్రి పదవులు ఇచ్చారని పేర్కొన్నారు. కోటబొమ్మాళిలో సర్వే నంబర్ 280/6లో 20 ఎకరాలు కొనుగోలు చేసుకుని, ఆ స్థలానికి ఆనుకుని ఉన్న సుమారు 10 ఎకరాల కొండ స్థలాన్ని కబ్జా చేసిన వ్యక్తి గోవిందరాజులు అని మండిపడ్డారు. కోటబొమ్మాళి పంచాయతీలో సుమారు 28.34 ఎకరాల చెరువులో దాదాపు 8 ఎకరాలు ఆక్రమించుకుని, ఆ భూమిలో గోవిందరాజులు రైస్ మిల్లు, వాణిజ్య సముదాయాలు నిర్మించుకోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. సుమారు 40 ఏళ్ల టీడీపీ పాలనలో కింజరాపు కుటుంబం అండతో ప్రజలు, రైతులను మోసం చేసి, బ్యాంకులను బురిడి కొట్టించి కోట్లాది రూపాయల సొమ్మును కాజేసిన వ్యక్తి గోవిందరాజులు అని దుమ్మెత్తిపోశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

విమర్శలు చేయడం విడ్డూరం

బ్యాంకు రుణాలు తీసుకుని, వాటిని కట్టకుండా రాజకీయ అండతో అక్రమాలకు పాల్పడిన గోవిందరాజులు వైఎస్సార్‌సీపీ పాలనపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో ఆయనతో పాటు ఆయన సోదరుడికి ఎంత అప్రతిష్ట ఉందో రైస్ మిల్లర్లకు తెలుసునని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో జిల్లాలో చేసిన అభివృద్ధి కనిపించలేదా అని నిలదీశారు. మూలపేట పోర్టు, ఉద్దానం కిడ్నీ ఆస్పత్రి, ఉద్దానం ప్రాంతానికి సురక్షితమైన నీరు వంటి కార్యక్రమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని గుర్తు చేశారు. కింజరాపు కుటుంబం దోచుకుంటున్న సొమ్ముతో పావలా వడ్డీకి డబ్బులు తెచ్చుకొని, వాటితో దోపిడీలు చేస్తున్న గోవిందరాజులు వైఎస్సార్‌సీపీ పాలనపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇకనైనా నోరు అదుపులో పెట్టుకోకపోతే అతని అవినీతి బండారం మొత్తం బయటపెడతామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.హేమసుందర్‌రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావు, మండల నాయకులు రోణంకి ఉమా మల్లయ్య, బి.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాల అమలుపై సంతృప్తి

- ముగిసిన జాతీయ స్థాయి బృందం పర్యటన
- గ్రామీణాభివృద్ధి పనుల మెరుగుదలకు సూచనలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ పథకాల అమలును పరిశీలించిన జాతీయ స్థాయి బృందం, తమ పది రోజుల పర్యటన అనంతరం బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో వారు జిల్లాలో పథకాల అమలు తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే కొన్ని లోపాలను గుర్తించి వాటిని సరిదిద్ది మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు. గ్రామీణ పేదలందరికీ పథకాల ప్రయోజనాలు అందాలనేదే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కేంద్ర బృంద సభ్యులు సునీల్ బంటా, నతూ సింగ్ మాట్లాడుతూ.. జిల్లాలో చేపట్టిన పర్యటనపై తాము సంతృప్తిగా ఉన్నామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు పథకాల ద్వారా అందుతున్న లబ్ధిని అభినందించారు.

విస్తృతంగా పర్యటన

జూలై 21వ తేదీ నుంచి 30వ తేదీ వరకు కేంద్ర బృందం జిల్లాలోని వివిధ మండలాల్లో విస్తృతంగా పర్యటించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సమగ్ర పర్యవేక్షణ చేపట్టింది. దీనిలో భాగంగా సంతబొమ్మాళి మండలంలోని బోరుభద్ర, ఉమ్మిలాడ, తాళ్లవలస గ్రామాల్లో, కొత్తూరు మండలంలోని కొత్తూరు, నివగాం నేరడి గ్రామాల్లో, శ్రీకాకుళం మండలంలోని రాగోలు, శిలగాం-సింగువలస పంచాయతీల్లో పర్యటించారు. ఈ గ్రామాల్లో స్వయం సహాయ సంఘాల పనితీరు, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) అమలు, ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణాలు, గ్రామీణ రహదారుల పథకం (పీఎంజీఎస్‌వై) ద్వారా రోడ్ల నిర్మాణం, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన (డీడీయూ-జీకేవై), ఆర్‌సెటిఐ వంటి పథకాల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి పథకాల ప్రయోజనాల గురించి ఆరా తీశారు. సమీక్ష సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు కిరణ్ కుమార్, డ్వామా ప్రాజెక్టు అధికారి సుధాకర్, జాబ్స్ మేనేజర్ రమణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర బృందం సభ్యులు

ఈదుపురంలో చోరీ



ఇంట్లో చిందరవందరగా పడివున్న సామగ్రి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని ఈదుపురం గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ బాసి భారతి ఇంట్లో దొంగలుపడి సొత్తును దోచుకున్నట్లు రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. బాసి భారతి కుటుంబ సభ్యులు ఇతర ప్రాంతాల్లో ఉండడంతో ఈనెల 21న ఆమె బంధువుల ఇంటికి విశాఖపట్నం వెళ్లారు. గురువారం ఆమె ఈదుపురం తన ఇంటికి రావాల్సి ఉండగా, ముందస్తుగా ఇంటిని శుభ్రపరచాలంటూ ఆమె తన బంధువుకు చెప్పారు. అయితే బుధవారం సాయంత్రం బంధువు మహిళా తలుపులు తీసేసరికి ఇంట్లో వస్తువులు, సామాగ్రి చిందరవందరగా ఉండడంతో ఇంట్లో దొంగలు పడ్డారంటూ బాసి భారతికి ఫోన్‌లో సమాచారం ఇచ్చింది. దీంతో ఆమె హుటాహుటిన ఈదుపురం చేరుకొని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన క్లూస్ టీమ్ ఇళ్లంతా క్షుణంగా పరిశీలించారు. ఎస్ఐ ఈ.శ్రీనివాస్ మాట్లాడుతూ అగంతకులు ఇంటి పెరటి నుంచి ఇంట్లోకి వచ్చారని, పోగొట్టుకున్న వస్తువులపై బాసి భారతి తమకు స్పష్టమైన సమాచారం అందించడం లేదని, పూర్తి వివరాలు వచ్చిన తర్వాత ఫిర్యాదు మేరకు విచారణ చేస్తామన్నారు.

లోకాయుక్త ఫిర్యాదుపై సర్వే

జి.సిగడాం: మండల కేంద్రంలోని 92/8 సర్వే నంబరులో ఉన్న భూమిని కొంతమంది ఆక్రమించి కల్యాణ మండపంతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని ఇటీవల పి.జగదీశ్వరరావు అనే వ్యక్తి లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. దీంతో ఈనెల 14వ తేదీన మండల సర్వేయర్, తహసీల్దార్ సమక్షంలో సర్వే చేపట్టారు. వీరు చేసిన సర్వే సక్రమంగా లేదని, జిల్లాస్థాయి అధికారులతో సర్వే చేపట్టాలని జగదీశ్వరరావు మరలా కోరారు. దీంతో బుధవారం లోకాయుక్త అధికారి సమక్షంలో ఆ భూమిని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ఏడీలు కె.రమేష్, కె.రమణమూర్తి, డీఐవోలు అనుపోజు వెంకటేశ్వరరావు, ఎ.మన్మథరావు అధ్వర్యంలో సర్వే చేపట్టారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని వెల్లడించారు.



భూమిని పరిశీలిస్తున్న రెండు జిల్లాల అధికారులు

యూరియా అందక రైతుల నిరసన

జలుమూరు: మండలంలోని మర్రివలస సచివాలయం పరిధి కరకవలసలో యూరియా పంపిణీలో తమకు మొండిచేయి చూపారని కరకవలస రైతులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మర్రివలస సచివాలయంకు యూరియా లోడ్ వస్తే టీడీపీ నాయకులే తమ ఇష్టం వచ్చినవారికి సర్దుబాటు చేసుకున్నారని గురుగుబిల్లి సింహాచలం, సీపాన జీవరత్నం, పేడాడ కృష్ణమూర్తి, వెంకటరావులు అవేదన వ్యక్తం చేశారు. అలాగే సుమారు ఆరు కిలో మీటర్ల దూరంలో సచివాలయం ఉండడంతో తరుచూ ఇబ్బందులు పడుతున్నామని గరుకు ఏకాదశి, కృష్ణారావులు తెలిపారు. అధికారులు స్పందించి తమ సొంత గ్రామం కరకవలసలో ఎరువుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై ఏవో కె.రవికుమార్ వద్ద ప్రస్తావించగా మర్రివలసలో ఎరువుల పంపిణీ సమస్య తమ దృష్టికి వచ్చిందని, ఇక నుంచి అలా జరగకుండా చూస్తామన్నారు.



నిరసన తెలుపుతున్న రైతులు

బీఆర్ఏయూను సందర్శించిన వల్లీకుమారి

ఎచ్చెర్ల: బీఆర్ఏయూలో కంప్యూటర్ నెట్ వర్కింగ్‌లో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించేందుకు, పరిష్కార మార్గాలను సూచించేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం సైబర్ సెక్యూరిటీ సెంటర్ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ పి.వల్లీకుమారి బుధవారం వర్సిటీని సందర్శించారు. ఆంధ్రా యూనివర్సిటీ సీఎస్ఈ విభాగానికి చెందిన వల్లీకుమారి రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి గతంలో వైస్ చైర్మన్‌గా సేవలిందించారు. వర్సిటీ అంతటికీ ఏకీకృత నెట్‌వర్కింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్వాంటమ్ టెక్నాలజీ వినియోగం గురించి వివరించారు. బీఆర్ఏయూ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని ప్రొఫెసర్ వల్లీకుమారి సేవలను కొనియాడారు. వారితో పాటు వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ సామ్రాజ్యలక్ష్మి, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజశేఖరరావు, టి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర్వులను తక్షణమే వెనక్కి తీసుకోవాలి

ఎచ్చెర్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎచ్చెర్లలోని ఐఎంఎల్ డిపోను విడదీసి, టెక్కలిలో కొత్త డిపో ఏర్పాటు కోసం ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విడదీసి 3 తరాలుగా డిపోలో పనిచేస్తున్న కార్మికుల పొట్టకొట్టవద్దని కోరారు. ఈ మేరకు ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీలు బుధవారం ధర్నా నిర్వహించారు. 1986లో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి 100 మంది దళిత కుటుంబాలకు చెందిన 4 ఎకరాల భూమిని ఎటువంటి నష్టపరిహారం ఇవ్వకుండా తీసుకొని, ఎచ్చెర్ల లో యారక్ బాటలింగ్ యూనిట్ ఏర్పాటు చేసింద ని గుర్తు చేశారు. ప్రభుత్వం సారా తయారీ కేంద్రంలో దళిత కుటుంబాలకు కార్మికులుగా, హమాలీలు గా ఉపాధిని కల్పించారన్నారు. అనంతరం ఐఎంఎల్ డిపోగా మారిన ఈ కేంద్రంలో పనిచేస్తూ 350 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నా రు. ఎచ్చెర్లలో సొంత గోడౌన్లలో మద్యం సరఫరా చేస్తుంటే, అదనంగా టెక్కలిలో మరో డిపో అద్దెకు తీసుకుని ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. దీనివలన అద్దెల భారం ప్రభుత్వంపై పడుతుందన్నారు. ఎన్ని పోరాటాలు చేసినా, వినతిపత్రాలు అందించినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు.కార్యక్రమంలో ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపో హమాలీస్ యూనియన్ నాయకులు టి.రామారావు, ఎం.సురేష్, రాము, జి.గురుమూర్తి, పట్నాన రామారావు,ఎల్.సీతారాం, ముద్దాడ రాజు, కేవీ రమణ పాల్గొన్నారు.



ధర్నా చేపడుతున్న సీఐటీయూ నాయకులు, హమాలీలు, కార్మికులు

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తలకొరివి పెడుతున్న కుమార్తె అనూరాధ

సరుబుజ్జిలి: కుమారుడు ఉన్నప్పటికీ జబ్బుతో మంచానపడడంతో తండ్రికి కుమార్తె తలకొరివి పెట్టిన ఘటన సరుబుజ్జిలి మండలంలో చోటుచేసుకుంది. నందికొండ కాలనీకి చెందిన కూన సింహాచలం పక్షవాతంతో ఐదేళ్లుగా బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. ఈయనకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. కుమారుడు కూడా గత కొద్ది సంవత్సరాలుగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. అలాగే పెద్ద కుమార్తె అందుబాటులో లేకపోవడం వలన, పురుషోత్తపురం గ్రామానికి చెందిన చిన్న కుమార్తె పైడి అనూరాధ తండ్రి చితికి నిప్పుపెట్టి రుణం తీర్చుకుంది.

ఎవరో వస్తారని ఎదురుచూడక..!



ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని.. ఎదురుచూసి మోసపోకుమా అని శ్రీశ్రీ చెప్పిన మాటలను ఆ కాలనీ ప్రజలు ఆదర్శంగా తీసుకున్నారు. టెక్కలి జగతిమెట్ట సమీపంలోని జగనన్న కాలనీలో కాలనీవాసులు సొంతంగా నిధులు సమకూర్చుకుని రోడ్లు బాగు చేసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో ఇక్కడ జగనన్న కాలనీ ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలు అందజేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ కాలనీకి ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో విసిగిపోయిన కాలనీవాసులు కొన్ని వీధుల్లో సొంతంగా రోడ్లు వేసుకుంటున్నారు. వీధుల్లో పూర్తిగా గోతులమయంగా ఉన్నటువంటి రహదారిపై వేస్ట్ మెటీరియల్ వేస్తూ గోతులను పూడ్చుకుంటున్నారు. పల్లె పండగ పేరుతో ప్రతీ గ్రామంలో రోడ్లు వేశామని కూటమి నాయకులు ప్రసంగాలు చేస్తున్నప్పటికీ, జగనన్న కాలనీలపై వివక్ష చూపుతూ కనీసంగా రోడ్లు కూడా వేయలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
– టెక్కలి

- జిల్లాలో విస్తారంగా వరి సాగు
- అధిక దిగుబడులకు సూక్ష్మ పోషకాలు కీలకం
- చర్యలు తీసుకోవాలని అధికారుల సూచనలు



సూక్ష్మంతోనే.. దిగుబడులకు మోక్షం..!

కవిటి:



టి.భవానీ శంకర్

ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా ఖరీఫ్ వరిసాగు విస్తృత స్థాయిలో సాగుతోంది. సాగు ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో పంటల్లో అధిక దిగుబడుల సాధనకు రైతులు తీవ్రంగా ఆలోచిస్తున్నారు. అయితే పంటల పెరుగుదలకు సూక్ష్మ పోషకాల ఆవశ్యకత ఎంతో అవసరమని సోంపేట సబ్ డివిజన్ ఏడీఏ టి.భవానీశంకర్ తెలిపారు. నత్రజని, భాస్వరం, పొటాష్ అందుబాటులో ఉన్నా, సూక్ష్మ పోషకాల లోపాలు ఉంటే పంటల దిగుబడి తగ్గుతుందని పేర్కొన్నారు. జింక్, ఇనుము, బోరాన్, రాగి, మాంగనీస్, మాలిబ్డినం, క్లోరిన్ వంటి మూలకాలను సూక్ష్మపోషకాలు అంటారు. నేలలో ఏ ఒక్క సూక్ష్మ పోషక పదార్థం లోపం ఉన్నా సరైన ఫలితం ఇవ్వదు. అందువలన నేలలోనే వాటికి సంబంధించిన ఎరువులను వేసుకొని పంట లోపాలు నివారించుకోవాలని సూచించారు.

జింక్: మొక్కల పెరుగుదలకు అవసరమైన నత్రజని, భాస్వరం వంటి పోషకాల సమర్థ వినియోగానికి జింక్ చాలా అవసరం.

లోపం: జింక్ లోపం ఉంటే మొక్క పైనుంచి మూడు లేదా నాలుగు ఆకుల్లో మధ్య ఈనే పాలిపోతుంది. నాటిన రెండు నుంచి నాలుగు వారాల్లో ముదురాకు చివర్లలో మధ్య ఈనెకు ఇరుపక్కల తుప్పు లేదా ఇటుక రంగు మచ్చలు కనిపిస్తాయి. ఇది మిగతా ఆకు అంతటా వ్యాపిస్తుంది. ఆకులు గిడసబారి దుబ్బు చేయవు. పైరుకు నత్రజని ఎరువులు వేసినప్పటికీ పైరు పచ్చగా ఉండదు

నివారణ చర్యలు: వరి పండించే భూముల్లో ప్రతీమూడు సార్లుకు ఒకసారి, రబీ సీజన్ రెండు పంటలు పండించే భూముల్లో ఆఖరి దమ్ములో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ చల్లుకోవాలి. భాస్వరం ఎరువుతో జింక్ సల్ఫేట్ కలిపి వేయరాదు. వీటి మధ్య కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి. జింక్ సల్ఫేట్ వేయలేని పరిస్థితుల్లో పైరుపై జింక్ లోపం కనిపించగానే లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాలి.

ఇనుము: ఆకుల్లో పత్రహరితం తయారు కావడానికి ఇనుము ఆధారం. ఇది పిండి పదార్థం తయారీకి ఉపయోగపడుతుంది. అధిక క్షార భూముల్లో, సున్నపు రాయి పాలు ఎక్కువగా గల నేలలు, తేలిక నేలల్లో, సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్న నేలల్లో ఇనుప దాతు లోపాలు కనిపిస్తాయి. మెట్టవరి, మెట్ట నారుమళ్లలో ఇనుప దాతు లోపం సాధారణంగా కనిపిస్తుంది.

నివారణ చర్యలు: ఒక లీటర్ నీటికి 20 గ్రాముల అన్నభేది, రెండు గ్రాముల నిమ్మ ఉప్పులో కలిపి పిచికారీ చేసుకోవాలి. ఈ ద్రావణాన్ని ఐదు రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేసుకోవాలి. ఇక మిగతా సూక్ష్మ పోషకాలు తక్కువ మోతాదులో అవసరం అవుతాయి. మార్కెట్లో అన్ని సూక్ష్మ పోషకాల మిశ్రమం ఆగ్రోమినిమార్క్స్ రూపంలో ఫార్ములా–4 రూపంలో లభ్యమవుతాయి. సూక్ష్మ పోషకాల అవసరాన్ని బట్టి పైరులో వీటిని తగిన సమయంలో వాడి అధిక దిగుబడి పొందవచ్చు.

సూక్ష్మధాతు లోపాల నివారణ చర్యలు

మట్టి పరీక్ష: నేలలో ఏ సూక్ష్మధాతువు లోపించిందో తెలు సుకునేందుకు పంటకాలం ప్రారంభానికి ముందు మట్టి పరీక్ష చేయించుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: మట్టిపరీక్ష ఫలితాల ఆధారంగా సూక్ష్మధాతువులను అందించే ఎరువులను అందించాలి.

పచ్చిరొట్ట పైర్లసాగు: సూక్ష్మధాతు లోపాల నివారణకు సేంద్రియ వ్యవసాయ విధానాలు మేలు చేస్తాయి. ఇందులో ప్రధానంగా పంట సీజన్ ప్రారంభంలో కుళ్లిన పశువుల గత్తం, వర్మీ కంపోస్టును భూమిలో చల్లుకొని కలియదున్నాలి. జీలుగు, పిల్లిపెసర, నవధాన్యాల సాగువంటి విధానాలతో పచ్చిరొట్ట పైర్లను పెంచి దమ్ము సమయంలో వీటిని భూమిలో కలియదున్నాలి.

దీనికి అదనంగా ఎకరానికి కనీసం 100 కిలోల సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్‌ను పైపాటుగా వేసుకుంటే పచ్చిరొట్ట పైరును బాగా కుళ్లిస్తుంది. దీనిద్వారా ఆ భూమిలో సేంద్రియ కర్బనంతో పాటుగా సూక్ష్మ ధాతువుల స్థిరీకరణకు సహాయపడుతుంది.